

కలెక్టర్‌ను కలిసిన డిఎఫ్‌ఒలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాకు కొత్తగా నియమితులైన డిఎఫ్‌ఒశంబంగి వెంకటేష్, పార్వతీపురం మన్యం జిల్లా డిఎఫ్‌ఒ జీవిపి ప్రసూనలు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అటవీశాఖ స్థితి గతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అటవీశాఖ పరిధిలో నిర్వహిస్తున్న మొక్కలు పెంపకం, అటవీ సంరక్షణ చర్యలపై వారు కలెక్టర్‌కు వివరించారు. వారితో పాటు టెక్కలి సబ్ డిఎఫ్‌ఒ నాగేంద్రరావు, పాలకొండ సబ్ డిఎప్‌ఒ సంజయ్, రేంజ్ అధికారులు పి.అమ్మన్నాయుడు, జగదీశ్వరరావు, రాజశేఖర్, నిహారిక, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలపై పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. మండలంలోని ఆఫ్‌షోర్ రిజర్వాయర్, నిర్వాసిత గ్రామాల్లో శనివారం పర్యటించి చీపురుపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ 2024 నాటికి మహేంద్రతనయ నుంచి రిజర్వాయర్‌కు 13 కిలోమీటర్ల కాలువ తవ్వకం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ నిధులు కేటాయించకపోవడం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. 17 ఏళ్లుగా 40 శాతం పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. పూర్తి చేస్తే మూడు మండలాల్లో 25వేల ఎకరాలకు నీరు అందించవచ్చని చెప్పారు. దీంతోపాటు పలాస-కాశీబుగ్గకు తాగునీరు ఇవ్వవచ్చని తెలిపారు. 2007లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.123 కోట్లు అయితే, అది నేడు రూ.852 కోట్లకు పెరిగిందని, పాలకుల నిర్లక్ష్యమే దీనికి కారణమన్నారు. నిర్వాసిత గ్రామాలైన చీపురుపల్లి, రేగులపాడు, శారదాపురం, చిన్నగురువూరు, దాసుపురంలో ప్రజలకు పూర్తిగా పరిహారం చెల్లించలేదని తెలిపారు. ఏడు కాలనీలు కట్టాల్సి ఉండగా, ఒకటి మాత్రమే పూర్తి చేశారని చెప్పారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆర్ అండ్ ఆర్ కాలనీలు వెంటనే పూర్తి చేయాలని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వెంటనే పూర్తి చేయాలని, సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించుకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు, నాయకులు పాలిన పి.సాంబమూర్తి, రైతుసంఘం నాయకులు కె.హేమసూదన్, సిఐటియు నాయకులు కె.సూరయ్య, నిర్వాసితుల సంఘం నాయకులు పాలిన శంకర్, ఇప్పిలి కృష్ణారావు, పాలిన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యారంగ సమస్యలపై పోరాటంలో భాగంగా మొదటి విడత కార్యాచరణ శనివారం శ్రీకాకుళంలో ప్రారంభించారు. అందులో భాగంగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. జిఒ నంబరు 117 రద్దుచేసి ఎంఎస్ నంబరు 53 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. హై స్కూళ్లలో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఒక కిలోమీటర్ పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించాలన్నారు. మున్సిపల్, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేసే సిఆర్‌టిలను, బాష వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలన్నారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలన్నారు. ఎయిడెడ్ నుంచి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో అబ్జార్వ్ అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్య తీసుకోవాలన్నారు. మినిమం టైమ్స్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు రావలసిన అన్ని గ్రాంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు కేదాలయ్య, యుటిఎఫ్ సీనియర్ నాయకులు చౌదకి రవీంద్ర, పి.అప్పారావు, జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, బి.శంకరరావు, జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ వై.ఉమాశంకర్, పి.ధర్మారావు, టి.వైకుంఠరావు, కె.సురేష్‌కుమార్, కె.వైంకుఠరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- పైడిభీమవరం వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిపోకుండా మండలాల్లో తహశీల్దార్ల అధ్యక్షతన భూగర్భ గనులశాఖ, ఎంపిడిఒలు, పోలీసు, ఎస్‌ఇబిలతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే వాహనాలకు అనుమతి ఉంటుందని చెప్పారు. వెయిటింగ్ ఛార్జీలు లేకుండా రవాణా ధర నిర్ణయించాలన్నారు. రోజుకు వంద ట్రాక్టర్ల ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. కూపన్లు సరఫరా చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రవాణా ఛార్జీలు ఉండాలని సూచించారు. నాటు బళ్లతో ఒక దగ్గర నిల్వ చేసి లారీలతో తరలిస్తే లారీ సీజ్ చేస్తామన్నారు. స్థానిక అవసరాలకు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా నాటు బళ్లతో ఇసుక తీసుకోవచ్చన్నారు. అంతర జిల్లా సరిహద్దు పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీసు, ఎస్‌ఇబి శాఖల అధికారులు పనిచేస్తారని తెలిపారు. జెసి ఇసుకపై ఎస్‌ఇబి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఒరిశా భూభాగంలో ఇసుక తవ్వకాలు జరిపినా, విశాఖపట్నానికి తరలించేందుకు శ్రీకాకుళం జిల్లా నుంచి రవాణా చేయాల్సి ఉంటుందని ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి గంగాధర వివరించారు. బిల్లులకు క్యూఆర్ కోడ్ ఆధారంగా పరిశీలిస్తామని అన్నారు. సమావేశంలో భూగర్భ గనులశాఖ డిడి ఎస్.కె.వి.సత్యనారాయణ, డిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, భూగర్భ గనుల శాఖ ఎడి ఫణిభూషణ్‌రెడ్డి, ఉప కలెక్టర్ అప్పారావు, టెక్కలి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన్‌దొర, విజిలెన్స్ స్క్వాడ్ కె.వెంకటేశ్వరరావు, డిపిఒ వెంకటేశ్వరరావు, జలవనరులశాఖ ఎస్ఇ సుధాకర్, ఆర్‌బ్ల్యుఎస్ ఎస్ఇ జి.జె.బెన్వర్, ఆర్‌టిఒ జియస్‌ఎల్‌వి మంగాదేవి, గ్రౌండ్ వాటర్ డిడి రమణమూర్తి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు మహర్దశ

పారిశుధ్యానికి రూ.99.90 లక్షల కేటాయింపు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలోని మున్సిపాలిటీల్లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, పూడిక తీసేందుకు ప్రభుత్వం రూ.99.90 లక్షల నిధులు కేటాయించింది. కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రారంభంలోనే కాలువలు శుభ్రం లేకపోవడంతో మురుగు నీరుతో పాటు వరదనీరు వెళ్లడానికి వీలుగా మున్సిపాలిటీల్లో కాలవలు అస్తవ్యస్తంగా ఉన్నట్లు గుర్తించింది. అసెంబ్లీ కార్యక్రమాలకు ముందే పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ రాష్ట్రంలో మున్సిపాలిటీల్లో కాలువల్లో వ్యర్థాలకు రూ.50 కోట్లు కేటాయించారు. రాష్ట్ర పురపాలక సంఘం ముఖ్య కార్యాలయం నుంచి అన్నీ మున్సిపాలిటీలకు కేటాయించిన మొత్తం నిధుల వివరాలు శుక్రవారం మధ్యాహ్నం వెబ్‌సైట్‌లో పెట్టారు. దీన్ని డౌన్‌లోడ్ చేసుకొని కేటాయించిన మొత్తం నిధులకు ప్రతిపాదనలు చేసే పనిలో ఇంజినీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. మరో నెలరోజుల్లో వీటికి సంబంధించిన పనుల వివరాలు ప్రతిపాదనలు తయారు చేసి అమరావతి మున్సిపల్ హెడాక్వార్టర్స్ పంపించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీలో ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. కేంద్రం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘ నిధులు, మున్సిపాలిటీలు సొంతంగా ప్రతిపాదించిన నిధులు (జనరల్ ఫండ్)తోనే కాస్తోకూస్తో అభివృద్ధి చేశారు. దీంతో కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీరు నుంచి వర్షం నీరు వరకూ కాలువల్లో కాకుండా రోడ్లపైనే ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ముందుగా కాలువల్లో వ్యర్థాలు తీయడానికి ప్రాధాన్యం ఇచ్చి ముఖ్యమంత్రికి చెప్పి నిధులు కేటాయించుకున్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, మున్సిపాలిటీకి రూ.27.25 లక్షలు, పలాస-కాశీబుగ్గకు రూ.42.94 లక్షలు, ఆమదాల వలస మున్సిపాలిటీకి రూ.29.71 లక్షలు మంజూరయ్యాయి. వీటి పనులు మూడు నెలల్లో చేపట్టి నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. కేవలం కాలువల్లో పూడికలు తీయడానికి భారీ మొత్తంలో నిధులు కేటాయించడంపై పాలకవర్గంతో పాటు అధికారులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బుడగట్లపాలెం హార్బర్ పనులను ప్రారంభించాలి



మాట్లాడుతున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను తిరిగి మొదలు పెట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి హార్బర్ పనులకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తన ఛాంబర్‌లో శనివారం మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిలిచిపోయిన హార్బర్ పనులను ప్రారంభించి ప్రతి 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. హార్బర్‌కు ప్రత్యేకంగా రోడ్డును కూడా నిర్మించాలని చెప్పారు. జిల్లాలో అమలు అవుతున్న ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి పి.శ్రీనివాసరావు, ఎడి గోవిందరావు పాల్గొన్నారు.

విద్యతోనే మంచి సమాజం



నియామకపత్రాలను అందజేస్తున్న బాలాజీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యార్థులు చదువుపై శ్రద్ధపెట్టి విద్యకు ప్రాధాన్యత ఇచ్చి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని, విద్యతోనే మంచి సమాజాన్ని రూపొంది ంచుకోవచ్చు అని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో రెండో రోజు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 520 మంది విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపించగా 460 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసు కున్నారు. రెండో రోజు కౌన్సెలింగ్‌లో వంద మంది బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. వంద స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యను ఇష్టంతో అభ్యసించాలని అన్నారు. తద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని హితవు పలికారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర కుమార్, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, కౌన్సిలింగ్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పి.గోవర్ధనరావు, కౌన్సెలింగ్ కోకో ఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

అదనపు ఎస్‌పి ప్రేమ్‌కాజల్



మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మైనర్ల డ్రైవింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్ తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న వారు ద్విచక్ర వాహనాల నడపాలన్నారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలు మేరకు ఆర్ట్స్ కాలేజీలో అధ్యాపకులతో, విద్యార్థులతో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు గురించి తెలియజేసి వారితో ముఖాముఖి మాట్లాడారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్న ప్రమాదాలపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి భవిష్యత్‌పై ప్రభావం ఉంటుందని అన్నారు. డ్రగ్స్ ర్యాగింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ అవతారం, ఎస్ఐలు మెట్ట సుధాకర్, సందీప్ కుమార్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, బాలికల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి, ఆమదాలవలస జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.శ్యామసుందరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

- జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 1715 మంది అభ్యర్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. శాఖాపరమైన పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై డిఆర్‌ఒ ఛాంబరులో సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు 1715 మంది ఉద్యోగులు హాజరు కానున్నట్లు వివరించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు ఆబ్జెక్టివ్ టైప్ ఉంటుందన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకు ఉంటుందని, డిస్క్రిప్టివ్ ఉంటుందని చెప్పారు.

అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు ముందుగానే చేరుకోవాలన్నారు. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు దృష్టిసారించాలన్నారు. ముందుగానే సిట్టింగ్ ఏర్పాట్లు, వెలుతురు ఉందా లేదా చూడాలని సూచించారు. సెల్‌ఫోన్లు తీసుకురావద్దని చెప్పారు. సర్వీస్ రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని స్పష్టం చేశారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ బి.సిహెచ్.ఎన్ కుమార్‌రాజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.శివప్రసాద్, పరీక్షల నిర్వహణకు సంబంధించిన శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్షన్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

దగా చేసిన బిజెపికి ధన్యవాదాలా?



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల అనంతరం లోక్‌సభలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరినీ భంగపాటుకు గురిచేసింది. టిడిపి మద్దతుపై ఆధారపడి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం, ఈసారి బడ్జెట్‌లో కాస్తయినా ప్రాధాన్యమిస్తుందని జిల్లావాసులు ఆశించారు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీరు మారినట్లు కనిపించడం లేదు. బడ్జెట్ కేటాయింపు విషయంలో అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కకపోవడం తీవ్ర నిరాశ పరిచింది. విభజనతో నష్టపోయిన రాయలసీమలోని నాలుగు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని ఇవ్వాలని రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిపాదన చేస్తే, దాన్ని పక్కనపెట్టి వెనుకబడిన ప్రాంత ప్యాకేజీ కింద ఏడాదికి రూ.50 కోట్లు ఇస్తామంటూ పాత పాటే పాడింది. తలసరి ఆదాయం, వ్యవసాయం, పారిశ్రామికంగా బాగా వెనుకబడిన జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్లు ఏ మూలకు సరిపోతాయి. బడ్జెట్‌లో ఎపికి ఏదో మేలు చేస్తున్నామని చెప్పుకోవడానికి తప్ప ఏరకంగా ఉపయోగకరం. రాష్ట్రంలో రాయలసీమలోని నాలుగు, ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలు బుందేల్‌ఖండ్‌లో ఉన్న ఆర్థిక, సామాజిక వెనుకబాటు, నిరక్షరాస్యత, ఆదాయలేమి వంటి పరిస్థితులే ఉన్నాయి. ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందడానికి 2009-10 నుంచి నాలుగేళ్ల పాటు రూ.6,831 కోట్లను కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం అందించింది. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి వనరుల అభివృద్ధి, మార్కెటింగ్, నిల్వ వంటి రైతుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను సమకూర్చుకుని కొంత ప్రగతి సాధించింది. బడ్జెట్‌లో ఆ రకమైన ప్యాకేజీని ప్రకటించి ఉంటే వెనుకబడిన శ్రీకాకుళానికి ఎంతగానో దోహదపడేది.

కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలకు (సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్‌లు) అధికంగా నిధులు తీసుకురావడంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నించినా అది ఫలించలేదు. అమరావతి, పోలవరంతో పాటు సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్‌లకు సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. ఒక్కో ఎంపీకి వేర్వేరు శాఖలకు సంబంధించి రాష్ట్ర మంత్రులకు బాధ్యతలు అప్పగించి కేంద్రం నుంచి నిధుల సాధనకు ప్లాన్ చేసినా అవి సఫలం కాలేదు. రాష్ట్రానికి నిధుల కోసం టిడిపి కూటమి ప్రభుత్వం ఒకవైపు రకరకాల ప్రయత్నాలు సాగిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం ఉత్తమాటలతోనే సరిపెట్టింది. అమరావతి నిర్మాణానికి కేంద్రమే నేరుగా సాయమందిస్తుందని టిడిపి కూటమి పెద్దలు ఆశిస్తే, వారికి కేంద్రం ఝలక్ ఇచ్చింది. బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు ప్రకటించి, ఆ మొత్తాన్ని పలురకాల ఏజెన్సీల ద్వారా సమకూరుస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పడంతో అంతా ఖంగుతిన్నారు. ప్రపంచబ్యాంకు వంటి సంస్థలకు మధ్యవర్తిగా హామీ ఉండి అప్పు ఇప్పిస్తున్నట్లుగా తెలియడంతో, ఈమాత్రం సాయానికి ఆర్భాట ప్రకటనలేలా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ద్వారా రుణం అందించడమంటే ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రానికి ఇది మరింత గుదిబండ కానుంది. ఇలా ఉంటే రాష్ట్రంతో పాటు జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులకు సాయమందించే ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, జిల్లాలో ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటిని అందించే జలజీవన్ మిషన్, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, పేదలకు గృహ కల్పనకు దోహదపడే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాలకు కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ తగ్గించినట్లు తెలుసుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం ఖంగుతింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీలో ఈనెల 27న నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశంలో సైతం ప్రస్తావించడం గమనార్హం. జిల్లాకు సంబం ధించి రైల్వే లైన్ల అభివృద్ధి తప్ప కొత్త ప్రాజెక్టులు, కొత్త రైళ్లేవీ కేటాయించకపోవం మరింత నిరాశకు గురిచేసింది. ఆదాయపు పన్ను పరిమితి పెంపుపై ఆశలు పెట్టుకున్న వేతన జీవులకూ నిరాశ తప్పలేదు. రిటైర్ అయి ప్రశాంతంగా ఉన్న పెన్షనర్లనూ ఆందోళన గురిచేసేలా బడ్జెట్‌లో ఉండటంతో వారు ధర్నాలు చేసే పరిస్థితికి వచ్చింది.

కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం బ్రహ్మాండంగా ఉందంటూ కితాబు ఇస్తున్నారు. అసెంబ్లీలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశంసిస్తూ ట్వీట్ కూడా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపే ఆనందకర విషయం బడ్జెట్‌లో ఏముందని? పదేళ్ల తర్వాత విభజన చట్టం హామీలకు కట్టుబడి ఉన్నామంటూ ఎపి ప్రస్తావన తీసుకురావడం తప్ప నిధులు కుమ్మరించేటంత కేటాయింపులు ఏం చేశారనేది బడ్జెట్‌ను చూస్తే తేటతెల్లమవుతుంది. రాష్ట్రానికి ఏం ఇచ్చారో చంద్రబాబు వంటి సీనియర్ రాజకీయవేత్తలకు ఒక అంచనా ఉండకపోదు. అందరి మాదిరిగానే తానూ అసంతృప్తి వ్యక్తం చేస్తే, కేంద్రంలో ఎన్‌డిఎ నుంచి బయటకు రావాలనే నినాదానికి నాంది పలికినట్లవుతుందని భావించారో ఏమో బయటకు ఆనందం వ్యక్తం చేశారు. బిజెపితో ఇప్పుడిప్పుడే పెనవేసుకుంటున్న బంధానికి ఆదిలోనే ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని విమర్శించకూడదన్నట్లుగా టిడిపి వైఖరి కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించకపోవడాన్ని తప్పు పట్టకపోయినా, దగా చేసిన బిజెపికి ధన్యవాదాలు తెలపడమే రాష్ట్ర ప్రజలకు బాధ కలిగిస్తోంది. మరోవైపు బడ్జెట్‌లో రాష్ట్రం, వెనుకబడిన జిల్లాపై బిజెపి చూపిన తీవ్ర నిర్లక్ష్యం, నిధులు తీసుకురావడంతో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజలకు గంతలు కట్టేందుకు ప్రయత్నించడం శోచనీయం. బడ్జెట్‌లో ఏమీ ఇవ్వకపోయినా ఆహో ఓహో అద్భుత మంటూ కీర్తిస్తే రాష్ట్రానికి ఏం ఒనగూరుతుంది. ఇప్పటికైనా రాష్ట్రానికి చెందిన కూటమి, వైసిపి ఎంపీలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టులు, నిధులు రాబట్టుకునే ప్రయత్నం చేస్తారని అంతా ఆశిద్దాం.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శాసనసభ సమావేశాలు ముగియడంతో సొంత నియోజకవర్గానికి చేరుకున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం శ్రీకాకుళం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసిన ఆయన నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.


జెసిని దుశ్శాలువతో సన్మానిస్తున్న విఆర్‌ఒలు

జెసికి సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కొత్తగా నియమితులై బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను శనివారం తన ఛాంబర్‌లో గ్రామ పరిపాలనాధికారుల సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. యనను కలిసిన వారిలో విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షులు వంజరాపు రమేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పల నాయడు, గౌరవ అధ్యక్షులు వేణుగోపాలరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ శాస్త్రి ప్రసాద్ ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శృతి

రాత్రి గస్తీలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాత్రి గస్తీలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు సిబ్బందికి డిఎస్‌పి శృతి సూచించారు. శనివారం పట్టణంలోని సర్కిల్ పోలీసు కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. సర్కిల్ పరిధిలో ఉన్న నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో నిర్వహిస్తున్న రాత్రి గస్తీలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్కిల్ పరిధిలో ఎటువంటి చోరీలు, ఇతర నేరాలు జరగకుండా రాత్రివేళ గస్తీ విధులు నిర్వహించే పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండేటట్లు పర్యవేక్షించాలని సిఐ వాయునందన దివాకర్ యాదవ్, ఎస్ఐ వెంకటేష్‌లకు సూచించారు. మహిళలు, యువతులు, విద్యార్థినిల రక్షణపై చేపట్టాల్సిన విధివిధానాలను వివరించారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం విధి విధానాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రమాదాల బారినపడి యువతీ, యువకులు ఎక్కువగా మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్‌ను బరువుగా కాకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండి వాటిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపాన గోవిందరావు, సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, మోహనరావు, అచ్చెన్నాయుడు, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

టెక్కలి : మండలస్థాయి విద్యాశాఖ విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒలు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సంస్కరణల వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పోతుందని వివరించారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు సమాతరంగా బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేత పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ఉన్నతస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, డొంకాన పాపారావు, విజయ్‌కుమార్, నారాయణరావు, శ్రీధర్, చిన్నవాడు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

పలాస: మండలంలోని సున్నాడలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి వీధిలోనూ నీరు సరఫరా అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని టిడిపి నాయకులు కుమ్మరి సింహాద్రి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రసన్నలను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వీధులకూ తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా కావడం లేదని వివరించారు. ఈ సందర్భంగా వారు స్పందించి మరో నీటి సరఫరా వాల్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

కిరాణా షాపుల తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలోని పలు కిరాణా షాపులను పలాసకు చెందిన మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ శనివారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ కందిపప్పును షాపుల్లో అమ్మకాలు, ధరలు, నాణ్యత తదితర అంశాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు.

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- రణస్థలం

పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమానికి కృషి చేయడమే తన ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే నా ధ్యేయమన్నారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామన్నారు. జె.ఆర్.పురంలో అపరిశుభ్రత అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో అసౌకర్యాలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. విద్యాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధన ప్రకారం పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారం సక్రమంగా అమలు చేయాలన్నారు. మండలంలో ఐసిడిసిని మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు. విద్యుత్‌శాఖపై జరిగిన సమీక్షలో ఎఇ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శ్రీనివాసరావు మాట్లాడడానికి సిద్ధంకాగా విద్యుత్ అంతరాయం కలగడం ఒక్కసారిగా సభలో సభ్యులు నవ్వుకున్నారు. విద్యుత్ కోత లేకుండా నాణ్యమైన విద్యను ప్రజలకు వినియోగదారులకు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఉపాధిహామీ పథకం పనులు సక్రమంగా జరగడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. మండల అభివద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. వ్యవసాయశాఖ సమీక్షలో రైతులందరికీ వరి, పత్తి విత్తనాలను రాయితీ ద్వారా సరఫరా చేయడం జరిగిందని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. దశలవారీగా అన్ని గ్రామాలలో త్రాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉపాధిహామీ పథకం అమలుపై జరిగిన సమీక్షలో 23 వేల జాబ్ కార్డుల ద్వారా కూలీలకు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయి కుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, స్పెషలాఫీసర్ బంటుపల్లి దుర్గారావు, ఎంపిడిఒ ఆర్.వి. రమణమూర్తి, సర్పంచ్‌ల ప్రతినిధి వెంకట భానోజీ నాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- లావేరు

పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బుడుమురు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో శిక్ష సప్తాహ్ 6వ రోజు ఇకో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పర్యావరణ పరిసరాలపై సంరక్షణ భావాన్ని పెంపొంది ంచడానికి ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నీటి నిర్వహణ, చెత్త నిర్వహణ, ఎనర్జీ, ఆరోగ్య వంతమైన జీవన శైలి అలవర్చుకొనుటకు కాలుష్య రహిత వాతావరణం, సుస్థిర ఆహార వ్యవస్థలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ విద్యాలయంలో 160 మంది విద్యార్థులు వారి తల్లులతో కలిసి 500 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సాయిబ్ అలాం ప్రారంభించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నాటిన మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకున్నారు.

నందిగాం: మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.గున్నయ్య అధ్యక్షణ 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి 30 పూల మొక్కలను నాటారు. మొక్కల చుట్టూ పాదులు కట్టి ఒక్కో విద్యార్థికి మొక్క చొప్పున దత్తత ఇచ్చి పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో


లావేరు : మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు బి.శంకరరావు, పి.వనతి, వి.కుమారి, కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

మందస : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఇఒ ఎం.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని సిరిపురం జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు నగిరి తారకేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

టెక్కలి రూరల్: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలైపోతున్నాయని శుక్రవారం 'ప్రజాశక్తి'లో 'విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్‌శాఖ ఎఇ తమ్మినేని ఈశ్వరరావు స్పందించి శనివారం పరిశీలించారు. విద్యుత్ మీటర్ తొలగించి విద్యుత్ నిలుపుదల చేసి ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలకు డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అందజేస్తామని, లేదంటే నిలుపుదల చేస్తామని నోటీసులు జారీ చేశారు. దీనికి కారణమైన సిబ్బంది చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజేశ్వరరావు

సిఎంను కలిసిన తేజేశ్వరరావు

పాతపట్నం: నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రి సిఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. ఈ మేరకు పాతపట్నం నియోజకవర్గ బిజెపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఢిల్లీ విమానాశ్రయంలో ఎన్‌డిఎ ఎంపీలతో కలిసి చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆధార్ నమోదు

పలాస: మండలంలో ఈ నెల 23 నుంచి 27 వరకు చేపడుతున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాల కేంద్రం వద్ద 547 ఆధార్ నమోదైనట్లు ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు తెలిపారు. మండలంలోని రెంటికోట ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈయనతో పాటు కార్యదర్శి సద్గుణబాబు, సిబ్బంది ఉన్నారు.

అటెండెన్స్ యాప్ మొరాయింపు

టెక్కలి : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల అటెండెన్స్ యాప్ శనివారం మొరాయించింది. చాలావరకు మొరాయించిందన్న విషయం తెలియక ఉపాధ్యాయులు అటెండెన్స్ వేసేందుకు నానా పాట్లు పడ్డారు. అలాగే పాఠశాలకు సంబంధించిన మిగిలిన అంశాల నమోదుకు సంబంధించిన యాప్‌లూ మొరాయించడంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురయ్యారు. తరువాత యాప్ పనిచేయడం లేదని తెలుసుకున్నారు.

కుమ్మరిపాడు పాఠశాలలో ప్రేరణ

సోంపేట : మండలంలోని కుమ్మరిపాడు ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జాగృతి సంస్థ అధ్యక్షుడు ప్రముఖ మనో వికాస నిపుణుడు రామ్ బుడ్డి గణపతి ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కిరణ్ కుమార్, పి.జయలక్ష్మి, జాగృతి, చందు, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

న్యాయం జరిగే వరకు పోరాటం

కవిట: తమకు శాశ్వత తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి, తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బెంతు ఒరియా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ బిసాయి అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు శనివారానికి 214వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన అవకాశాలు కోల్పోయి, వెనుకబాటుకు గురవు తున్నారన్నారు. అన్ని రంగాల్లో వెనుక బడిన బెంతు ఒరియా మహిళలు ప్రభుత్వ పథకాలకు దూరమవు తున్నారన్నారు. కొత్త ప్రభుత్వమైన తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆధార్ శిబిరం పరిశీలన

టెక్కలి రూరల్ : ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కె.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని రావివలస గ్రామ సచివాలయంలో ఏర్పాటు చెందిన ఆధార్ శిబిరాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదు, సవరణల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు.


పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్ : యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌లపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించి పరిశ్రమలు, ఉపాధి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇతరశాఖల సమన్వయంతో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. భారీ, మధ్యతరహా, చిన్నపరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఇప్పటికే మ్యాప్ చేశారని, పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణను అందించడం, నైపుణ్యం కలిగిన యువతను ఉపాధి అవకాశాలతో అనుసంధానించడానికి తరచుగా జాబ్‌మేళాలు నిర్వహించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మూలపేట పోర్టు, ఇంకా జిల్లాలో ప్రధాన పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపార సంస్థలతో కలిసి వారి నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని, శిక్షణ పొందిన వ్యక్తులు తగిన ఉద్యోగాలు పొందేలా ప్రణాళిక ఉండాలని అన్నారు. ఎలక్ట్రీషియన్లు, వైర్‌మెన్లు, మోటార్ మెకానిక్‌లు, ప్లంబర్లు, మేసన్‌లు, కార్పెంటర్లు, కుట్లు అల్లికలు వంటి వివిధ ట్రేడ్‌ల కోసం శిక్షణ ఉంటుందని అన్నారు. స్వయం ఉపాధి, ప్రత్యక్ష ఉద్యోగ నియామకాలకు తోడ్పడే శిక్షణను అందించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.బి. సాయిశ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి జె.ఉమామహేశ్వరరావు, సీడాప్ జెడిఎం ఎస్.వి.రమణమూర్తి, ఎల్‌డిఎం ఎం.కిరణ్‌కుమార్, డిఎన్‌డిఒ శ్రీధర్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజంలోని సవాళ్లను ఎదుర్కోవాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

బిటెక్, మేనేజ్‌మెంట్ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు సమాజంలోని సవాళ్లను ఎదుర్కొని బాధ్యతగల పౌరులుగా సమాజసేవ చేయాలని విశాఖపట్నం ఎన్ఎసిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహాం వరుగాసె అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 8వ పట్టభద్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రమించి ఇంజినీరింగ్, కోర్సులు పూర్తిచేసేందుకు సహకరించిన తల్లితండ్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. కొత్త ఆలోచనలకు పదును పెట్టి సమాజం గర్వించే వ్యక్తులుగా తయారవ్వాలన్నారు. కళాశాల బిఒజి గవర్నర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ పి.వి.జి.డి ప్రసాదొడ్డి సందేశం అనంతరం ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ ఐతమ్ రెండు దశాబ్దాలుగా గ్రామీణ విద్యార్థులకు అందిస్తున్న విద్య, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు, అధ్యాపక బృందం



మాట్లాడుతున్న ఎన్సిల్ డైరెక్టర్ అబ్రహం

నైపుణ్యతల గురించి వివరించారు. అనంతరం 2023-24లో బిటెక్, ఎంబిఎ కోర్సులు పూర్తిచేసిన 500 మంది విద్యార్థులకు పతకాలు, డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి .నాగేశ్వరరావు, శ్రీ ఆదిత్య సొసైటీ డైరెక్టర్లు డాక్టర్ కె.రవికుమార్, కె.మధుకుమార్, టి.నాగశేషు, డీన్లు, హెచ్‌డిలు పాల్గొన్నారు. ఈ సదస్సుకు కన్వీనర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ వి.చిట్టిబాబు వ్యవహరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరంలోని వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శనివారం పరిశీలించారు. ప్రధానంగా తోటపాలెం రోడ్డులో మోకాలి లోతు గోతులు ఏర్పడి వర్షపునీరు రోడ్డుపై నిల్వ ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు గోతుల్లో వాహనాలు వెళ్తున్న సమయంలో బురదనీరు ఇళ్లలోకి ఎగిరి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రిమ్స్ రోడ్డు, గుజరాతీపేట, శాంతినగర్ కాలనీ, కళింగ రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతాలను


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు

పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా కాలువల్లో పూడికలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రిమ్స్ వైద్య కళాశాల పరిసరాల్లో కాలువల్లో పెద్దఎత్తున పూడిక ఉండడంతో నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని హడ్కో కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన సత్వర మరమ్మతులకు ఆదేశించారు.

విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌కు పునాది

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని, ఆకర్షణలకు, మత్తు పదార్థాలకులోనై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ మొజ్జాడ ప్రవళ్లిక అన్నారు. జెసిఐ శ్రీకాకుళం మెయిన్ వారోత్సవాల్లో భాగంగా నగరంలో చైతన్య కో-ఆపరేట్ జూనియర్ కళాశాలలో యాంటీడ్రగ్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని జెసిఐ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్ విద్యనభ్యసించే సమయంలో భవిష్యత్‌ను నిర్దేశించుకుని ఉన్నత స్థాయిని అందుకునేందుకు శ్రమించాలన్నారు. ఆకర్షణలకులోనై, ఫోన్లు, మత్తు పదార్థాలకు బానిసై చదువును అశ్రద్ధ చేస్తే జీవితకాలం బాధపడాల్సి వస్తుందన్నారు. జెసిఐ పూర్వపు అధ్యక్షులు జామి బీమశంకర్, ప్రస్తుత అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, జెసిఐ గ్రీన్‌సిటీ పూర్వపు అధ్యక్షులు మణిశర్మ, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం ప్రవళ్లికను శాలువతో సత్కరించారు.

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కాశీబుగ్గ రూరల్ సిఐ ఈశ్వరరావు



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఐ ప్రవళ్లిక

అన్నారు. మండలంలోని పూండి సాయి వినీత్ విద్యాసంస్థ ఆవరణలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు యంటీ రాగింగ్, మాదకద్రవ్యాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాష్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీను, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు.

'ప్రజాశక్తి' విలేకరికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు


సత్యనారాయణ

శ్రీకాకుళం: తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్తంగా అందిస్తున్న ఉత్తమ తెలుగు జర్నలిస్టు పురస్కారాలు 2024కు కవిటి మండలం ప్రజాశక్తి విలేకరి పూడి సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జితేందర్ 41మందితో కూడిన ఉత్తమ జర్నలిస్టుల జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' అంటూ మానవీయ కోణంలో కథనం రాసి ఓ పాప ఆపరేషన్‌కు అవసరమైన రూ.20 లక్షలు సమకూర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు సత్యనారాయణకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన వారికి పురస్కారంతో పాటు రూ.5 వేల నగదు బహుమతిని ప్రముఖుల చేతుల మీదుగా త్వరలో అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా తోటి విలేకరులు, సన్నిహితులు శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో సీతంవలసకు చెందిన చెందిన ధర్మాన రమేష్ (21) శనివారం ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రమేష్ ఇంట్లో ఉదయం 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డారు. అప్పటి నుంచి వెళ్లిపోయాడు. సాయింత్రం ఐదు గంటల సమయంలో స్థానికులు సీతంవలస కొండ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరివేసుకుని రమేష్ చనిపోయి ఉండటం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడు రణస్థలంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. మృతుడుకి తల్లిదండ్రులు రాజలక్ష్మి, ఈశ్వరరావు, సోదరుడు నరేష్ ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్ఐ కె.గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణరావు

రైతుకు పాముకాటు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో డొంకలపర్తకు చెందిన జడ్డు నారాయణరావు శనివారం సాయంత్రం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఎడమచేతికి పాముకాటు వేయడంతో పరిసర ప్రాంత రైతులను పిలవడంతో వెంటనే గ్రామానికి సమాచారం అందజేశారు. నారాయణరావును వెంటనే ద్విచక్ర వాహనంపై పాలకొండ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు భాగ్యశ్రీ వైద్యం అందించారు.

ఇసుక లారీ పట్టివేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీని శనివారం ఉదయం రెవెన్యూ అధికారులు స్థానిక పొన్నాం మెయిన్ రోడ్డులో పట్టుకున్నారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కి అప్పగించారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్న వారిలో పొన్నాం, బట్టేరు, అలికాం, భైరి గ్రామ రెవెన్యూ అధికారులు గణేష్ ప్రసాద్, యశ్వంత్, రవితేజ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


కలాం చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సన్యాసిరావు తదితరులు

అబ్దుల్ కలాం వర్ధంతి

బూర్జ : మండలంలో పెద్దపేటలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిం చారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిదాయకమని, 11వ రాష్ట్రపతిగా దేశంలో ఒక ఆదర్శ ప్రాయంగా సేవలందించడం జరిగిందన్నారు. నూక అనుప, కో-ఆర్డినేటర్ బి. శంకరరావు, మెట్ట రవీంద్రనాథ్ భట్లు, సిఇఒ మాతోట వన ఉత్పత్తిదారుల కంపెనీ, ఆర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: ఇందిరా గాంధీ కూడలి వద్ద న్యాయవాదులు షేక్ బాజీ, ఎం.డి.ఫయాజ్ అహ్మద్‌గని ఆధ్వర్యాన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం 9వ వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. న్యాయవాదులు బి.కె.ఆర్.పట్నాయక్, చంద్రశేకరరావు, రజనీకాంత్, రవికుమార్ పట్నాయక్, చిట్టిబాబు, రాజు, తిరుమల, సురేష్, గోపాల్, అనిల్‌రాజు పాల్గొన్నారు.

నేడు వజ్రపుకొత్తూరు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిపి ఉప్పరపెల్లి నీలవేణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా నాయకులు, పూర్తి సమాచారంతో మండల అధికారులు హాజరుకావాలని సూచించారు.

నేడు ఐటిఐలో రెండో విడత కౌన్సెలింగ్

పలాస : పలాస డాక్టర్ వి.కణితీష్ ప్రభుత్వ ఐటిఐలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ పైల జవహర్ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ధ్రువపత్రాల పరిశీలన చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


పాస్ పుస్తకాన్ని అందజేస్తున్న రాజు

ఇచ్ఛాపురం : మండలంలోని లొద్దపుట్టికి చెందిన రోకాళ్ల మోహనరావు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మృతుడి భార్య రాధిక, కుమార్తెల పేరున రూ.54 వేలు పోస్టాఫీసులో ఫిక్సెడ్ డిపాజిట్ చేయించి శనివారం పాస్‌పుస్తకాన్ని అందజేశారు.

పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట సాగుచేయాలన్నా అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టిన తగిన ప్రతిఫలం లభించటంలేదని, అందుకే రైతులు ముందుకొచ్చి పామ్ ఆయిల్ పంటను సాగుచేస్తే లాభాలు వస్తాయ ఉద్యానవనశాఖ అధికారి కె.సునీత అన్నారు. అలాగే ఈ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. మండలంలోని నిలంపేటలో మెగా ప్లాంటేషన్ మేళాను స్థానిక రైతు రొక్కం తులసీదాస్ క్షేత్రంలో రైతులు చిట్టి సింహాచలం, బి రమేష్, పి గోవిందరావు, ఎం.శ్రీను, టి.గిరితో పామ్‌ఆయిల్ మెగా ప్లాంటేషన్ మేళాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉద్యానవనశాఖ ఆయిలపామ సాగు నిమిత్తం అందిస్తున్న పథకమని వివరించారు. ఉద్యాన విస్తరణ అధికారి జి.సంధ్య, శాంతి ఇండస్ట్రీస్ సిబ్బంది ఎన్.శ్రీనివాసరావు, జనార్ధనరావు, మనికృష్ణ, సచివాలయ సిబ్బంది కళ్యాణి, శశికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి సునీత


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు
ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం అదపాక మాజీ సర్పంచ్ గొర్లె అప్పల నాయుడును పరామర్శించారు. ఆయనకు ఇటీవల మోకాలుకి శస్త్రచికిత్స జరగడంతో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్తకుంకాం చెందిన పాత్రల్లపల్లి వీఆర్ఓ దొండపాటి వెంకట మురళీ తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందడంతో మురళీని పరామర్శించారు. ఆయన వెంట ఎంపిటిసి దొండపాటి శివ, నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎఒ నరసింహమూర్తి

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- సోంపేట
పంటసాగు కాలం మొత్తం వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల ఎఒ నరసింహమూర్తి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో శనివారం సమీక్షించారు. పంట సాగుకాలం ప్రారంభమైన నేపథ్యంలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సాగు విస్తీర్ణం, ప్రస్తుత సాగు పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. అలాగే ఎరువుల పంపిణీ ఇతర అంశాలపై దృష్టిసారించాలన్నారు.

అక్రమ ఫిర్యాదులు చేయొద్దు

సరుబుజ్జిలి : సచివాలయ వ్యవస్థలో అరకొర జీతాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పంచాయతీ సర్పంచ్‌లు అక్రమ ఫిర్యాదులు మానుకోవాలని మండల తెలుగుయువత కార్యదర్శి గండెం రవికుమార్ హితవు పలికారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని విజయరాంపురం గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌పై సర్పంచ్ తప్పుడు ఆరోపణలు చేస్తూ కొన్ని పత్రికల్లో ప్రకటన ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. గిరిజన యువకుడైన నిరుద్యోగి, సదరు ఎనర్జీ అసిస్టెంట్ గ్రామ సచివాలయంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందిస్తున్నారని అటువంటి వ్యక్తిపై వ్యక్తిగత ద్వేషంతో విధులు సక్రమంగా నిర్వహించలేదని కలెక్టర్, విద్యుత్ ఎడిలకు ఫిర్యాదు చేస్తానంటూ సర్పంచ్ భయపెట్టడం మానుకోవాలన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

మహిళా సంఘాలతో సమీక్ష

పలాస : మహిళా సంఘ సభ్యులు పొదుపులు, అప్పులు సక్రమంగా చెల్లించే విధంగా ఆర్‌పిలు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్లగిరి బాబు అన్నారు. మెప్మా విభాగంలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్ అధ్యక్షతన పట్టణ మహిళా సమైక్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాఖ్యల విధి విధానాలు, ప్రతినెలా అంతర్గత అప్పులు, పొదుపులు సక్రమంగా కట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి మరలా రుణాలు పొంది మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ పి.మోహనరావు, ఐ.బి.బి.రాము,ఐటి విభాగం నుంచి రమేష్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన బోధన అవసరం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
మానవ విలువలతో కూడిన విద్యాబోధన నేటి విద్యార్థులకు అత్యంత ఆవశ్యకమైనదని వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాజాం పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు కొల్లి సాయి మురళి అన్నారు. శనివారం సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సాయి మురళి నిజాయితీ, మానవ విలువలు అనే అంశంపై ప్రసంగించారు. నైతికతకు పెంపొందించే నీతికథలు విద్యార్థుల మనసును ప్రభావితం చేస్తాయన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన అధికారులు ఉద్యోగులు ఏ కార్యాలయంలో ఉన్నా వారు ప్రత్యేకమైన వ్యక్తులుగా గుర్తింపు పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు, అధ్యాపకులు నాగేంద్ర, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, సంగీత విజయ వినోద్ రాజు, విజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు సాయి మురళి

నైపుణ్యాన్ని వెలికితీస్తేనే మహిళా సాధికారత



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ప్రజాశక్తి- నరసన్నపేట
తమలో దాగిన నైపుణ్యాలను వెలికి తీసి, ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఐతమ్ కళాశాల ఇంగ్లీష్ ప్రొఫెసర్ కె.విజయలక్ష్మి అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కాలేజ్‌లో శనివారం మహిళా సాధికారత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. విధిరాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీక నిలుస్తూ.. ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్నారని అన్నారు. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదని అన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ... అవరోధాలను అధిగమిస్తూ అడుగు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస
గ్రామసభలతో గ్రామ సమస్యలతో పాటు పలు సమస్యలను పరిష్కరించుకోవచ్చని జిల్లా టిడిపి కాపు సాధికారిక అధ్యక్షులు, ఇసుకలపాలెం సర్పంచ్ పల్లి సురేష్ అన్నారు. శనివారం పెద్ద సవలాపురం సచివాలయంలో నిర్వహించిన ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ గ్రామసభలో పాల్గొన్నారు. ఉపాధి పథకం ద్వారా నెలకొన్న పలు సమస్యలపై కూలీలు సర్పంచ్ సురేష్‌కు అర్జీలు ఇవ్వగా గ్రామసభకు హాజరైన ఎస్ఆర్‌పి, డిఆర్‌పిలతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. అలాగే మిగిలిన సమస్యలను కూడా మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో అధికారులకు వివరించడం జరుగుతుందన్నారు. అక్కడకు హాజరైన ప్రజలతో కలిసి ఆయన గ్రామ సచివాలయ పరిసర ప్రాంతాల్లో పలు మొక్కలు నాటారు.


మొక్కను నాటుతున్న సురేష్


ఫ్రీజరు బాక్స్‌ను ప్రారంభిస్తున్న సిఐ వేణుగోపాలరావు

అందుబాటులో ఫ్రీజర్లు

ప్రజాశక్తి- కొత్తూరు
మండలంలో నిర్వహిస్తున్న భగత్‌సింగ్ ఛారిటబుల్ ట్రస్టుకి చెందిన సామాజిక వేత్త బామిడి రాజు అందించిన శీతల శవపేటికలు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సిఐ ఆర్.వేణుగోపాలరావు మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి వారు చనిపోతే వారి కుటుంబ సభ్యులు చివరి చూపు కోల్పోతున్న వారి కోసం పార్థివదేహం చెడిపోకుండా ఉండేదుకు ఫ్రీజర్ బాక్స్‌లు ఉపయోగపడుతుందని అన్నారు. ఇవి అందించేందుకు ట్రస్టు సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫ్రీజర్ బాక్స్ కావలసిన వారు 8121608946 నంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కె.పోలినాయుడు, ఎస్.హరికృష్ణ, పి.వినోద్, ఎల్.శివ, సంతోష్, రవి, బి.శ్రీను పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రాజు

అండర్‌పాస్ వేకి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అండర్ పాస్ వే నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఇచ్ఛాపురం వచ్చిన శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో అనేకసార్లు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరామని రాజు తెలిపారు. ఈ సమస్య పరిష్కరించకుంటే జనసేన తరుపు నుంచి శాంతియుత పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, రమణారావు, టిడిపి సోషల్ మీడియా సాలిన జగదీష్, మేఘనాథ్‌రెడ్డి, రైల్వే ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

పలాస : రైలు నిలయాల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు పనిచేయాలని ఈస్టుకోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర పంక్వాల్ ఆదేశించారు. ఒడిశా నుంచి ప్రత్యేక రైలులో భువనేశ్వర్ నుంచి పలాసవరకు జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈయన వెంట డిఆర్ఎం ఎస్.బాజ్పా, డి.టి.ఐ.భగవతిరావు ఉన్నారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు అన్నారు. స్థానిక ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ వద్ద రైతులకు సబ్సిడీ ఎరువులు విక్రయ కేంద్రం శనివారం ప్రారంభించారు. అనంతరం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా 45 కేజీ బస్తా రూ.266.50, డిఎపి 50 కేజీ బస్తా రూ.1350కు అందిస్తామన తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, బిజెపి ఇన్‌ఛార్జి బుద్దాల నిర్మలారెడ్డి, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, మండల అధ్యక్షులు దక్షత శ్రీను, పిఎసిఎస్ పర్సనల్ ఇన్‌ఛార్జి పాపారావు, సొసైటీ సిఇఒ భుజంగారావు, వ్యవసాయ అధికారి భార్గవి, సాలిన ఢిల్లి, తిప్పిన దుర్యోధనరెడ్డి, కాళ్ల జయదేవ్, సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంధిపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- నౌపడ
సంతబొమ్మాళి మండలం మూలపేట పంచాయతీలోని సంధిపేటలో సర్పంచ్ జీరు బాబూరావు శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు కాలువల్లో పూడికలు తొలగించి, బ్లీచింగ్ వేశారు. మరో రెండు రోజులు పాటు పంచాయతీలోని కాలువలు శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: మండలంలోని టి.బరంపురం పంచాయతీ కార్యక్రమంలో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు సంబంధించిన రోగులకు రాగోలు జెమ్స్ వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఎం.గీతిక, లహరి, భార్గవిలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని ఎంపిపి బోర పుష్ప ప్రారంభించి అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారింగి త్రినాథరెడ్డి, జెమ్స్ మేనేజర్ బి.చిన్నారావు, ఎన్.ఉమ, జి.గోపి, బి.లోకేష్, తిప్పన ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.


మందులను పంపిణీ చేస్తున్న ఎంపిపి పుష్ప